బుధవారం 19 ఫిబ్రవరి 2025



శ్రీ సత్యసాయి

జెఎన్‌టియు విసిగా సుదర్శనరావు



విసి సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్‌గా హెచ్.సుదర్శన్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. అంతకు మునుపు వైస్ ఛాన్సలర్‌గా శ్రీనివాసరావు ఉండేవారు. ప్రభుత్వం మార్పు జరిగాక ఆయన తన పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి మూడు మాసాలుగా సుదర్శన్‌రావు జెఎన్‌టియు ఇన్‌ఛార్జీగా వ్యవహరిస్తున్నారు. ఆయన్నే ఇప్పుడు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. అనంతపురం జెఎన్‌టియులోనే అధ్యాపకులుగా ఈయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసరుగా పనిచేస్తున్న ఆయన ఇక్కడే వైస్ ఛాన్సలరుగా నియమితులవడంతో ఇక్కడి పరిపాలనా వ్యవహారాల మీద చక్కటి అవగాహన ఉండనుంది.

సుదీర్ఘమైన బోధానా అనుభవం

వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన సుదర్శన్‌రావుకు సుదీర్ఘమన బోధనా అనుభవముంది. 39 ఏళ్లుగా బోధానా రంగంలో పనిచేస్తున్నారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో డైరెక్టర్‌గా పనిచేశారు. అనంతపురం జెఎన్‌టియు వైస్ ప్రిన్సిపాల్‌గానూ, రెక్టార్‌గానూ పనిచేశారు. హైదరాబాద్ జెఎన్‌టియు బిక్రాడ్ డైరెక్టర్‌గానూ పనిచేశారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

కార్మికుల వివరాలు నమోదు చేయండి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో రెండు లక్షల అసంఘటిత కార్మికుల వివరాలను ఈ-శ్రమ్ పోర్టులో రిజిస్ట్రేషన్లు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ, జిల్లా స్థాయి అమలు కమిటీలతో జిల్లా లేబర్ అధికారి సూర్యనారాయణతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2 లక్షల మంది అసంఘటిత కార్మికులు ఉన్నారన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో చిన్న సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, తాపీ మేస్త్రీలు, శానిటరీ వర్కర్లు, ఎలక్ట్రిషన్, ఇటుక బట్టీలలో పనిచేసే కూలీలు, రిక్షా కార్మికులు, టైల్స్ వర్క్ చేసేవారు, భవన నిర్మాణ కార్మికులు, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్, కుమ్మరి కమ్మరి, బంగారు పనిచేసే కార్మికులు, తోపుడు బండ్లు వీధి వ్యాపారస్తులు తదితర కార్మికులను గుర్తించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేసే కార్మికులందరూ ఈ-శ్రమ్ కార్డుల నమోదుకు అర్హులన్నారు. మధ్యాహ్న భోజనం తయారీ కార్మికులు కూడా అర్హులేనని తెలిపారు. జిల్లాలో ఇలాంటి వారంతా ఎంతమంది ఉన్నారో గుర్తించాలని డిఇఒ కృష్ణప్పకు తెలిపారు. చేనేత కార్మికులు, అంగనవాడీ వర్కర్లనూ ఇందులో నమోదు చేయాలని ఆదేశించారు. నమోదు అయిన వారందరికీ ప్రత్యేక గుర్తింపు నెంబరు, అకౌంట్ నెంబరుతో కార్డును ప్రభుత్వం జారీ చేస్తుందన్నారు. ఈ కార్డు ఉంటేనే సామాజిక భద్రత సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. ఇందులో నమోదైన, కార్మికునికి ఏడాది పాటు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు. ఈ పథకాన్ని విస్తతంగా ఆయా శాఖల హెచ్ఒడిలు అవగాహన కార్యక్రమాలు విస్తత ప్రచారాలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పరిశ్రమల శాఖ జిఎం.నాగరాజు, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఒత్తిడి భరించలేక..

చనిపోతున్నారు..!



ఫీజు ఒత్తిడితో జనవరి 23న అనంత నారాయణ కళాశాలలో ఆత్మహత్య చేసుకుని మరణించిన చైతన (ఫైల్‌ఫొటో)



పిల్లల భవిష్యత్తు బాగుండాలని.. ఎన్నో ఆశలతో తల్లిదండ్రులు ఆర్థిక భారాన్ని తమ భుజాలపై వేసుకుని పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తుంటారు. పిల్లల భవిష్యత్తును బంగారు మయం చేయాలనుకునే తల్లిదండ్రుల తపన ఆదిలోనే మృగ్యమైపోతోంది. ఆశల వేటలో చదువులు, ఆర్థికపరమైన ఒత్తిడులను ఎదుర్కోలేక పిల్లలు అర్థాంతరంగా జీవితాలను చాలిస్తున్నారు. కుటుంబాలకు భవిష్యత్‌లో వెలుగు దివ్వెలవుతారనుకుంటే చీకట్లు నింపి వెలుతున్నారు. అనంతపురం జిల్లాలో వరుసగా చోటు చేసుకుంటున్న విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తోంది. మంగళవారం జరిగిన విద్యార్థి ఆత్మహత్య ఘటనతో కలిపి ఈ ఏడాదిలో ముగ్గురు విద్యార్థులు చనిపోయారు. నెల రోజుల వ్యవధిలోపే ఇద్దరు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఇందులో ఒకరిది ఫీజు ఒత్తిడి అయితే.. మరొకరిది చదువుల ఒత్తిడితో అర్థాంతరంగా తనువు చాలించారు.



మంగళవారం నాడు ఎస్ఆర్ కళాశాల చదువు ఒత్తిడి తాళలేక ఆత్మహత్య చేసుకున్న శ్రీకాంత్ (ఫైల్‌ఫొటో



ఎస్ఆర్ కళాశాల వద్ద శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గత నెల జనవరి 23వ తేదీన చైతన్య అనే విద్యార్థి అనంతపురం నగరంలోని నారాయణ కళాశాల తరగతి గది మూడవ అంతస్తు నుంచి అందరూ చూస్తుండగానే కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది సిసి పుటేజుల్లోనూ రావడంతో దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఫీజు కట్టలేదని యాజామాన్యం ఒత్తిడి చేయడంతో ఆ విద్యార్థి బలవన్మరణం చెందినట్టు ఆరోపణలొచ్చాయి. అది మరువక ముందే మంగళవారం నాడు మరో ఘటన చోటు చేసుకుంది. అనంతపురం నగర శివారులోని ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతన్న శ్రీకాంత్ కళాశాల వెనుకవైపునున్న దానిమ్మ తోటలోకెళ్లి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చదువుల ఒత్తిడితోనే ఆ విద్యార్థి మరణించినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.



అనంతపురం జిల్లాలో విద్యార్థుల మరణాలు వరుసగా సంభవిస్తున్నాయి. గత నెలలోనే

కార్పొరేట్ కళాశాలల ఒత్తిడితోనే ఆత్మహత్యలు ?

కార్పొరేట్ కళాశాల్లో విద్యార్థులపై రెండు రకాలైన ఒత్తిళ్లు ఉంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మొదటి ఫీజుల ఒత్తిడి కాగా, రెండవది ర్యాంకుల సాధన కోసం సాగుతున్న చదువుల ఒత్తిడిగా తెలుస్తోంది. ఇందుకు జిల్లాలో జరిగిన రెండు ఆత్మహత్యలే సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. నారాయణ విద్యా సంస్థలో చనిపోయిన చైతన్య ఫీజు ఒత్తిడి కాగా, ఎస్ఆర్‌లో చనిపోయిన శ్రీకాంత్ చదువుల ఒత్తిడి కారణమని తెలుస్తోంది. ఈ కళాశాలల్లో విపరీతమైన ఒత్తిడి విద్యార్థులపై పడుతోంది. రాత్రి సమయాల్లో 12 గంటల వరకు విద్యార్థులను బలవంతంగా స్టడీ హవర్స్ పెడుతున్నట్టు విద్యార్థులు చెబుతున్నారు. ఆ తరువాత తెల్లవారుజామున నాలుగు గంటలకు తిరిగి ప్రారంభమవుతున్నాయి. రోజుల్లో నాలుగైదు గంటలు కూడా నిద్ర ఉండని పరిస్థితి ఉంది. దీంతో విద్యార్థులు విపరీతమైన ఒత్తిడి గురవుతున్నారు.

- ◆ ప్రాణం తీస్తున్న ఫీజు, చదువుల ఒత్తిడి..!
- ◆ అనంతలో మరో విద్యార్థి బలి
- ◆ నెలలోపే ఇద్దరు ఆత్మహత్య
- ◆ ఫీజు, చదువు ఒత్తిళ్లే కారణం..
- ◆ తల్లిదండ్రులకు గుండెకోత

విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

నారాయణ విద్యా సంస్థల్లో ఒక విద్యార్థి తరగతి గది మూడవ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అది మరువక ముందే మరో విద్యార్థి ఇప్పుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మరణాలపై అధికారులు వెంటనే స్పందించి సమగ్రమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫీజుల ఒత్తిడులు, చదువుల ఒత్తిడితోనే ఇవి సంభవిస్తున్నా యన్నారు. వాటిని తగ్గించేందుక తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓతూరు పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనంతపురం.

తాగునీటి సమస్య పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఎమ్మెల్యే



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర

మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యల్లో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే ఎంఎస్. రాజు హెచ్చరించారు. పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో ఆర్ డబ్ల్యుఎస్, ఎంపిడిఒలు, పిఆర్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి సమస్యకు వచ్చిన నిధులను కేవలం తాగునీటి కోసమే ఖర్చు చేయాలని ఇతర పనులకు వినియోగించకూడదనిఆదేశించారు. 5మండలాల్లో తాగునీటి సమస్య ఉందని ఎవరైనా రోడ్డెక్కితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. గ్రామాల్లో ఉన్న రక్షిత మంచినీటి పథకాలతో పాటు శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకం ద్వారా వచ్చే తాగునీటిని కూడా వినియోగించుకుని సమస్య లేకుండా చూడాలన్నారు. పంచాయతీల్లో ఉన్న ప్రతి ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి శుద్ధ జల కేంద్రాలను పనిచేసేలా చేసి ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, గణేష్, కుమార్ స్వామి, మదన కుంటప్ప, దాసిరెడ్డి, జెడ్పిటిసి ఉమేష్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలులో ఇబ్బంది రానీయొద్దు : జేసీ

ప్రజాశక్తి రొద్దం

కందుల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలిగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని జేసీ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేవించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కందులు కొనుగోలు కేంద్రాన్ని జేసీతో పాటు పెనుగొండ సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్ పరిశీలించారు. ఈసందర్భంగా రైతులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులకు దృష్టికి తీసుకువచ్చారు. మూడు రోజుల నుంచి సంచుల కోసం పడిగాపులు కాస్తున్నామని వాపోయారు. స్పందించిన జేసీ అక్కడే ఉన్న మార్క్‌ఫెడ్ ఎమ్‌డితో మాట్లాడారుజ వెంటనే సంచులు సరఫరా చేయాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉదయ్ శంకర్ రాజ్, డిటి చంద్రశేఖర్, మండల సర్వేయర్ మైనుద్దీన్, వీఆర్వోలు, అగ్రికల్చర్ ఏడి స్వయంప్రభ, ఏవో నివేదిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు భరోసా : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మహిళల భద్రతకు భరోసా కల్పిస్తున్నామని ఎస్పీ రత్న పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించేందుకు మహిళల భద్రత-భవిష్యత్తుకు భరోసా అనే అంశంపై మండలంలోని పెడబల్లిలో మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాలికలు, మహిళలపై జరుగుతున్న అకృత్యాలతో పాటు బాల్య వివాహాలు, సైబర్ క్రైం ఇతర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక కార్యక్రమం చొప్పున, వచ్చే నెల 15 వరకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల వారు ఈ సదస్సులో పాల్గొనడం అభినందనీయమన్నారు. మహిళలకు భద్రత, భవిష్యత్తుపై భరోసా ఇవ్వాల్సింది కుటుంబం, సమాజమేనన్నారు. సమాజంలో సమానత్వం స్వేచ్ఛతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ వంతుగా ఏం చేయగలమో ఆలోచించాలని సూచించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ మహిళలను చైతన్యవంతం చేసే అవగాహన సదస్సులను ఏర్పాటుచేసిన శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీని, పోలీసు శాఖను ఎమ్మెల్యే అభినందించారు. మహిళల హక్కులు, బాల్యవివాహాలు తదితర అంశాలపై విద్యార్థినులు, కళాకారులు ప్రదర్శించిన నాటికలు, ఆలపించిన చైతన్య గీతాలు మహిళల్లో చైతన్యం నింపాయి. ఏ ఆర్ ఎస్ ఐ శ్రీరాములు ఆలపించిన గీతాలు సభ్యులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీవో సువర్ణ, డిఎం అండ్ హెచ్ఒ ఫిరోజ్ బేగం, డిఆర్ డిఎ పిడి నరసయ్య, ఐసిడిఎస్ పిడి వరలక్ష్మి, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎస్బి ఎస్ఐ ప్రదీప్ కుమార్, పెడపల్లి సర్పంచి మంగ్లీ బాయి, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి ఆదినారాయణ, సీఐలు సురేష్, నరేందర్ రెడ్డి, సునీత, ఎస్ఐలు లింగన్న, మల్లికార్జున రెడ్డి, వెంకటనారాయణ, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం నేర్పాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

విద్యార్థులకు విద్యతోపాటు మంచి నడవడిక సంస్కారం ఎంతో అవసరమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని సిల్వర్ లైన్ ఇంగ్లీష్ మీడియం ప్రైమరీ పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి మనిషికి చదువు ఎంతో ముఖ్యమని తెలిపారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఈ పాఠశాల నుంచి విద్యార్థులు అందించిన సాయం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ షాకీర అబ్దుల్లా, టిడిపి సీనియర్ నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు, వలిటి శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు రమణి ,దిల్షాన్ ,శ్రీదేవి ,సాయిలీల



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

,చందన ,షాజహాన్, డ్యాన్స్ మాస్టర్ కామేష్ తదితరులు పాల్గొన్నారు.

20న కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలను ప్రజలు తిరస్కరించాలని కోరుతూ ఈ నెల 20న సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు తెలపనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలియజేశారు. మంగళవారం పుట్టపర్తి సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల్లో కొనుగోలు శక్తి కుచించుకుపోయి ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న సమయంలో మోడీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలివ్వడం, ఖర్చుల్లో కోత పెట్టడం తీవ్ర అభ్యంతరకరం అన్నారు. నిరుద్యోగ సమస్యను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గత ఏడాదికంటే తగ్గించడం విచారకరం అన్నారు. అవసరం ఉన్నప్పటికీ ఉపాధిహామీ పథకానికి నిధులు అదనంగా కేటాయించలేదన్నారు. ధరల పెరుగుదల, జీఎస్టీ పెంపుదలతో అనేక ఇబ్బందులు పడుతున్న కార్మికవర్గాన్ని ఈ బడ్జెట్ విస్మరించిందన్నారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ వామపక్ష పార్టీలు కొన్ని ప్రతిపాదనలు ప్రజల్లోకి తీసుకెళ్తోందన్నారు. అందులో భాగంగా వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలన్నారు. వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదాను ఉపసంహరించాలన్నారు. నేషనల్ మానిట్యెజేషన్ పైప్‌ల్కెన్ ద్వారా చేపట్టే ప్రభుత్వరంగ ప్రయివేటీకరణ చర్యలను, ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటు రంగానికి బదలాయించడాన్ని ఆపాలన్నారు. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలను ఉపసంహరించాలన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులను 50 శాతం పెంచాలన్నారు. పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని కూడా ప్రవేశపెట్టాలన్నారు. సామాజిక భద్రతా పింఛన్లకు కేంద్ర కేటాయింపులు పెంచాలన్నారు. జిడిపిలో ఆరోగ్య రంగ కేటాయింపులను 3, విద్యా రంగానికి ఆరు శాతం కేటాయింపులు పెంచాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆహార సబ్సిడీని పెంచాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ రంగాలకు, మహిళా, శిశు సంక్షేమానికి కేటాయింపులను గణనీయంగా పెంచాలన్నారు. స్కీమ్ వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనాల్లో కేంద్రం వాటాను పెంచాలని కోరారు. రాష్ట్రాలకు నిధుల బదిలీని పెంచాలని. అలాగే కేంద్ర ప్రాయోజిత పథకాలకు కూడా నిధులను గణనీయంగా పెంచాల్సి ఉందన్నారు. రాష్ట్రాలతో పంచుకునే విభాగంలో చేర్చని పెట్రోలియం ఉత్పత్తులపై సెస్సులను, సర్‌ఛార్జీలను రద్దు చేయాలన్నారు. ఈ విధానాలను ప్రజల్లో ప్రచారం చేయడం కోసం ఈ నెల 20 నుంచి జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేయనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇఎస్.వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు జెడ్‌పి.శ్రీనివాసులు, జివిఎల్. నర్సింహులు, జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మినారాయణ, ఆఫీస్ కార్యదర్శి సిద్ధు, శాఖ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

రసాబాసగా మండల మీట్

అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి - పరిగి

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సరితా ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాబాసగా మారింది. ప్రధానంగా ఇరిగేషన్ అధికారి లక్ష్మీనారాయణ పని తీరుపై వాడి వేడిగా చర్చించారు. పరిగి మండలంలో ఇరిగేషన్ అధికారి ఆధ్వర్యంలో అక్రమ మట్టి తవ్వకాలు శీతిమించాయని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అధికారిని మండల సర్వసభ్య సమావేశానికి పిలిపించాలని అప్పటిదాకా మండల మీట్ వాయిదా వేయాలని ఎంపిటిసిలు సర్పంచ్లు ఎంపీడీవో శ్రీధర్‌ను డిమాండ్ చేశారు. మండలంలో మట్టి తవ్వకందార్లతో వసూళ్లకు పాల్పడుతూ ప్రజలకు అందుబాటులో లేని అధికారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. సమావేవానికి బాయ్‌కాట్ చేసి బయటకు వెళ్లిన ప్రజా ప్రతినిధులకు నచ్చజెప్పి రాబోయే మండల సమావేశానికి తప్పక అతని పిలిపించి ఇరిగేషన్ శాఖ పై చర్చ నిర్వహిస్తామని అంతలోపు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపిడిఒ హామీ ఇవ్వటంతో సమావేశం ప్రారంభమైంది. పలువురు మండల అధికారులు ఆయా శాఖల పరిధిలో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రెవిన్యూ శాఖ పరిధిలో సమస్యలపై స్పందిస్తూ మండలంలో గ్యాస్ పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని తూకాలలో మోసాలు, అదనంగా వసూళ్లకు పాల్పడటం వంటివి జరుగుతున్నాయని వాటిపై తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జడ్పిటిసి శ్రీరాములు, తహశీల్దార్ హసీనాసుల్తానా, సర్పంచులు మంజునాథ్ రెడ్డి, లక్ష్మీదేవి, శివశంకర్, ఎంపీటీసీలు మారుతిరెడ్డి, మంజునాథ్ రెడ్డి, చిక్కన్న పలువురు పాల్గొన్నారు.



సభ్యులకు సర్దిచెబుతున్న అధికారులు

మస్తాన్‌వలి ఉరుసు

ప్రజాశక్తి - కొత్తచెరువు

ముస్లిం హిందూ సోదరులు ఐకమత్యంతో హజరత్ మస్తాన్‌వలి ఉరుసును జరుపుకోవాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి ఆయన దర్గాను సందర్శించడానికి రావటంతో ముస్లిం సోదరులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మస్తాన్‌వలి దర్గా లోకి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవం ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించాలని సూచించారు. మంగళవారం రాత్రి దీపారాధన కవాలి పాటలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా, మైనార్టీ నాయకులు సైకిల్ షాప్ బాబా, మాజీ జెడ్పిటిసి లక్ష్మీనారాయణ, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, సోకట్ వలి, ముస్సిర్ , ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని వంకమద్ది గ్రామ పొలంలో రైతు చంద్ర శేఖర్ సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా మెరైన యాజమాన్య పద్ధతులు, విత్తనం నుంచి అమ్మకం వరకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి లోకేశ్వర రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి శిరీష, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

సచివాలయానికి ప్రింటర్ అందజేత

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలం గుడ్డగురికి పంచాయతీ సచివాలయానికి యూనిట్ ఇన్‌ఛార్జి హేమంత్ కుమార్ ప్రింటర్‌ను అందజేశారు. ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు , రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి మండల కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో 20వేల రూపాయల విలువజేసే ప్రింటర్ అందజేశారు.

కార్పొరేషన్ రుణాల దరఖాస్తులు పరిశీలన

ప్రజాశక్తి - రొద్దం

వివిధ కార్పొరేషన్ల కింద రుణాల మంజూరుకు చేసుకున్న దరఖాస్తులను మంగళవారం పరిశీలించారు. మండలానికి మంజూరైన 48 యూనిట్లకు గాను 424 దరఖాస్తులు వచ్చాయి. వీరి దరఖాస్తులను మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం లో ఆయా బ్యాంకు అధికారులు, ఎంపీడీఓ రామ్ కుమార్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా బ్యాంకుల అధికారులు, ఎంపీడీవో రామ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

విద్యార్థుల సంక్షేమం కోసం సమన్వయంతో పనిచేయాలని వెనుక బడిన తరగతుల సంక్షేమ వసతి అధికారి బాలాజీ సూచించారు. మంగళవారం పట్టణంలోని వసతి గృహ సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో కదిరి డివిజన్ లోని వసతి గృహ సంక్షేమాధికారులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వచ్చే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆదేశించారు. ఈ సమావేశములో డివిజన్లోని వసతి గృహ సంక్షేమాధికారులు జయరామి రెడ్డి, రవీంద్రరెడ్డి, షబానా, అంజనేయులు, నరసింహ, రఘు నందన్ నాయక్, సాంఘికిఫను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. వార్డు పర్యటనలో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధిలోని ధర్మపురం, రహమత్ పురంలో ఆయన పర్యటించారు. ఆయా వార్డుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - మడకశిర

పట్టణంలోని రహదారుల విశ్రాంతి భవనంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పలువురు టిడిపిలో చేరారు. మండల పరిధిలోని వైబి హళ్లి పంచాయతీ వైసిపి నాయకులు రంగనాథ్, కాంత, హనుమంత రాయప్ప, లక్ష్మి నరసింహప్ప, చంద్ర, ఉమేష్, బైలర్ నారాయణప్ప, రాజన్న, కుమార్, మంజు, రామాంజి, పెద్ద తిమ్మప్ప, వేణు, ఆనంద్‌తోపాటు 20 కుటుంబాలు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రంగే గౌడ్ ,మడకశిర టి ఎన్ టి యు సి అధ్యక్షుడు రాజు, రవీంద్రరెడ్డి, నరసేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన వారితో నాయకులు

దళితులంటే జగన్‌కు చిన్నచూపు : ఎమ్మెల్యే ఎంఎస్.రాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర

దళితులు అంటే వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డికి ఎప్పుడూ చిన్నచూపే అని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు విమర్శించారు. పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు పాలనలో కక్షసాధింపు చర్యలకు ఎక్కడా తావు లేదనే విషయాన్ని జగన్మోహన్ రెడ్డి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దళిత ద్రోహి, మహిళా వ్యతిరేకి, దోపిడీదారుడు, ఖూనీలు చేసే మూలా నాయకుడు వల్లభనేని వంశీని జగన్మోహన్ రెడ్డి పరామర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. దళితులను చంపి డోర్ డెలివరీలు చేసిన వారిని, దళితులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడిన వారినే జగన్మోహన్ రెడ్డి అత్యధికంగా ప్రేమిస్తాడని, దళితులంటే జగన్మోహన్ రెడ్డికి ఎప్పుడూ చిన్నచూపేనని అన్నారు. చంద్రబాబు పాలనలో కక్షసాధింపు చర్యలు జరుగుతున్నాయని, వంశీ అరెస్టు కూడా అందులో భాగమే అని తప్పుడు మాటలు మాట్లాడే జగన్మోహన్ రెడ్డికి నిజంగా ధైర్యం ఉంటే ఈ విషయాలపై అసెంబ్లీలో చర్చించేందుకు రావాలన్నారు. వంశీ అరాచకాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, హవాలా విషయాలు మొత్తం అసెంబ్లీలో నిరూపించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దళితులను చంపి డోర్ డెలివరీ చేసినప్పుడు ప్రవీణ్ కుమార్ ఎక్కడున్నాడని ప్రశ్నించారు. తెలంగాణలో రాజకీయాలు చేసుకునే వాడికి ఏపీలో కుల రాజకీయాలు ఏమిటని ప్రశ్నించారు. గత పాలనలో చేసిన తప్పులకు ఏ అధికారి అయినా, ఏ కులానికి చెందినవారు అయినా జైలుకెళ్ళక తప్పదన్నారు. వంశీ అరెస్టు అప్రజాస్వామికం, కక్షసాధింపు చర్యే అయితే కోడి కత్తి, జోగి రమేష్, అనంతబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఎక్కడ ఉండేవారని అన్నారు. రాజకీయాల్లోకి నీచ సంస్కృతిని తెచ్చిన వ్యక్తి జగన్ అని అన్నారు.

అసంఘటిత కార్మిక రంగానికి మార్గదర్శి ఎన్ఎస్ . బేడీ

ప్రజాశక్తి-పెనుకొండ

అసంఘటిత కార్మిక రంగంలో సమూల మార్పులు తేవడానికి వారి హక్కుల కోసం చైతన్యం తేవడానికి గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయివరకు ప్రజా ఉద్యమాలు నిర్మించి అసంఘటిత కార్మిక రంగానికి యంగ్ ఇండియా ప్రాజెక్ట్ వ్యవస్థాపకులు నరేంద్ర సింగ్‌బేడీ మార్గదర్శి అయ్యారని సంస్థలో పనిచేసిన సీనియర్ నాయకులు వెంకటేశులు, కృష్ణమూర్తి బలరాం, కిష్టప్ప, కేశవయ్య, రామాంజనేయులు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సమగ్ర ఉపాధి హామీ ఆర్థిక భరోసా రావడానికి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం రూపకల్పనలో ముసాయిదా బిల్లు ను జాతీయస్థాయిలో మేధావులతో కలిసి తయారుచేసి పాలక ప్రభుత్వాలను ఒప్పించడంలో విజయం సాధించారన్నారు. 58 ఏళ్ల క్రితం పెనుకొండ కేంద్రంగా యంగ్ ఇండియా ప్రాజెక్ట్ సంస్థను స్థాపించి గ్రామీణ ప్రాంతంలో సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో అసమానతలకు గురైన వ్యవసాయ కూలీలకు యూనియన్లు ఏర్పాటుచేసి హక్కుల సాధనకు గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ప్రజా ఉద్యమాలు నిర్మించారని వివరించారు. ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఫిబ్రవరి 20న పెనుకొండలోని షాదీమహల్లో నరేంద్ర సింగ్ బేడీ సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియా ప్రాజెక్టుతో కలసి సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్న మద్దతు తెలిపిన సామాజిక విప్లవకారులు పాల్గొనాలని వారు తెలిపారు.

రాగి పంట సాగుపై అవగాహన

ప్రజాశక్తి - లేపాక్షి

స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారిణి శ్రీ లత ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన టీడీపీ మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని రైతులు ప్రతి ఒక్కరు స్థానిక వ్యవసాయం కార్యాలయం లో ఆధార్ కార్డు, పట్టాదార్ పాసుబుక్‌ను తీసుకెళ్లి పేర్లు నమోదు చేసుకొంటే ప్రభుత్వం అందించే పథకాలు వర్తిస్తాయన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు ట్రాన్స్ పోర్టు రంగం జిల్లా ప్రధానకార్యదర్శి పెడబల్లి బాబా డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ పోర్టు రంగం జిల్లా ప్రధాన కార్యదర్శి పెడబల్లి బాబా, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ వ్యవసాయం తరువాత కీలకమైన ట్రాన్స్ పోర్టు రంగం మీద చాలామంది నిరుద్యోగులు డిగ్రీ, ఇంటర్, టెన్త్ చదివి స్వయం ఉపాధి పొందడానికి అప్పులు చేసి ఆటో కొనుగోలు చేయడం జరిగిందన్నారు. వీరు ప్రభుత్వానికి ఆదాయం తీసుకొస్తున్నారన్నారు. టాక్స్‌ల రూపంలో ప్రభుత్వానికి ఆదాయాన్ని ఆటో కార్మికులు ఇస్తున్నారన్నారు. కానీ ఆటో కార్మికులకు ప్రభుత్వం ఏ రకమైన రాయితీలు సంక్షేమ పథకాలు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. రవాణా రంగాన్ని ప్రైవేట్ పరంచేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నుతోందని అన్నారు. వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు లైసెన్స్ లు మంజూరు చేసే అధికారాన్ని ప్రైవేటు ఏజెన్సులకు అప్ప చెప్పడం సరైనది కాదని ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు హనుమంతు, రవి నాయక్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి శివ ప్రసాద్ యాదవ్



జైలు గదిని పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారసంస్థ కార్యదర్శి

ప్రజాశక్తి-హిందూపురం

కారాగారంలో ఉండే ఖైదీల ఆరోగ్యంపై జైలు అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా న్యాయ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. కారాగారంలో ఖైదీలు అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యాధికారులతో చికిత్సలు చేయించాలన్నారు. మంగళవారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ఖైదీలకు ప్రభుత్వపరంగా ఉచిత న్యాయ సహాయం అందజేయడం జరుగుతుందని తెలిపారు. అలాంటి ఖైదీలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం జైలు గదులు, వంటగది, శుద్ధ జల ప్లాంటు, న్యాయ సహాయ కేంద్రం తదితర వాటిని శివప్రసాద్ యాదవ్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నవేరా, పారా లీగల్ వాలంటీర్ సురేష్, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ :పట్టణంలోని సబ్ జైలును ఉమ్మడి అనంతపురం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ మంగళవారం తనిఖీ చేవారు. జైలులో ఉన్న ఖైదీలతో ముఖాముఖిగా మాట్లాడి వారు ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. బ్యారెకులు, వంటగది, ఖైదీల గదులు, కార్యాలయ గదులను పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని ఖైదీలకు వడ్డించాలని, అన్ని సదుపాయాలు సక్రమంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జైలర్‌కు సూచించారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగి సబ్‌జైలు అధికారి వద్ద మంచి గుర్తింపు పొందాలని తెలిపారు. ఖైదీలందరికీ వారి సమస్యల పరిష్కారం కొరకు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బాలసుందరి, బిల్లే రవీంద్ర, ప్యారా లీగల్ వాలంటీర్ షామీర్ భాష, సబ్ జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రజాశక్తి-పెనుకొండ

ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ డిఏ లు, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్షులు కాడిశెట్టి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి.నరేష్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి హెచ్.బాబు తో కలసి పెనుకొండ మండలంలో మావటూరు,అడదాకులపల్లి,బండపల్లి,నాగలూరు,రాజేశ్వరి కాలనీ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12వ పిఆర్సీ కోసం కమిటీని వేసి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పిఆర్సీ కమిటీ ఏర్పాటు చేయడంలో ఆలస్యం జరగడం వలన ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్స్ ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా డిఎ లు పెంచకపోవడం వలన పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. తొమ్మిది నెలల నుండి పెండింగ్ ఉన్న భవిష్య నిధి రుణాలు, ఏపీ జి ఎల్ ఐ మొత్తాలు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగ,ఉపాధ్యాయులకు తక్షణం సంపాదిత సెలవుల మొత్తం, పిఎఫ్ మొత్తాలు చెల్లించాలన్నారు.

'అధికారుల ఏకపక్ష వైఖరి'

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ పరికరాలు లబ్ధిదారుల ఎంపికలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని చేనేత కార్మికులు విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలో చేనేత కార్మికులకు అందించే పరికరాల విచారణలో రాష్ట్రస్థాయి అధికారి ఒకరు, సత్యసాయి జిల్లా అధికారి ఒకరు మండల కేంద్రంలో విచారణ చేస్తున్నారని అందులో భాగంగా నిజమైన చేనేత కార్మికులను వదిలివేసి మరమగ్గాలు, పెద్ద పెద్ద ధనవంతులు వారికి అనుకూలంగా ఉన్న వ్యక్తులను ఇచ్చేందుకు అధికారులు సిద్ధమై వారి ఇండ్ల దగ్గరికి వెళ్లి విచారణ చేస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే మంగళవారం ఆ ఇద్దరు అధికారులు ఒకే ఇంటిలోనే ఐదుగురిని చేనేత మగ్గం నేస్తారా లేదా అనే విషయాన్ని పరీక్షించారని, అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులకు, బడా బాబులకు చేనేత పరికరాలు అందించడానికి ఈ విచారణ చేస్తున్నారని మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు శీలా నారాయణస్వామి ఆరోపించారు. రెండు రోజులుగా మండల కేంద్రంలో విచారణ చేస్తున్న చేనేత అధికారులు విలేకరులకు కూడా సమాచారం అందించకపోవడంతో తమ అనుమానాలకు బలం చేకూరుతోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు కలుగజేసుకొని నిజమైన చేనేత కార్మికులకు మాత్రమే సబ్సిడీ పరికరాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

అంగన్వాడీ కేంద్రాల సేవలపై అవగాహన కల్పించాలి



శిక్షణలో మాట్లాడుతున్న కోర్స్ డైరెక్టర్, ఎంఇఒ గంగప్ప



లేపాక్షిలో శిక్షణకు హాజరైన అంగన్వాడీలు

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని హిందూపురం మండల విద్యాశాఖ అధికారి, కోర్సు డైరెక్టర్ గంగప్ప పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హిందూపురం పట్టణ, గ్రామీణ మండలాల అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్వాడీలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వాలు ఎన్నో రకాల చర్యలు తీసుకోవడం జరుగుతోందని, వాటిని సద్వినియోగం చేసే బాధ్యత అంగన్వాడి కార్యకర్తలపై ఉంటుందని అన్నారు. ఆరు రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణా తరగతులను అంగన్వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 ప్రసన్నలక్ష్మి, సిడిపిఒ శాంతి, ఎంజీఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సామ్రాజ్యం, డి ఆర్ పి లు హరి ప్రసాద్, శ్రీనివాసులు, గోపాల్, జనార్ధన్, అనిత, సరస్వతి, జయమ్మ లతోపాటు పట్టణ, గ్రామీణ మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నంబులపూలకుంట:మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ అనంత పాఠశాలలో మంగళవారం అంగన్వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి 120 రోజుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల విద్యాధికారులు గోపాల్ నాయక్,సుబ్బిరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు పునాది దశలోనే మంచి విద్య మరియు అలవాట్లు నేర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు నరసమ్మ, లక్ష్మీదేవి, మౌలాబీ, డిఆర్పీలు చిన్న రెడ్డప్ప, మహేష్ రెడ్డి, నాగేంద్ర, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బత్తలపల్లి :చిన్నారులలో బాల్య, పునాదిదశ నుండే విద్యాభ్యాసం బలోపేతం చేయాలని మండల విద్యా శాఖ అధికారులు చాముండేశ్వరి,సుధాకర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఇఒలు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020 అమలులో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రముఖ విద్యా సంస్థల సహకారంతో జ్ఞానజ్యోతి పేరుతో అంగన్వాడీ కార్యకర్తలకి 120 రోజులపాటు వివిధ రకాల శిక్షణలు అందిస్తోందన్నారు. ఈ శిక్షణలో పలు అంశాలపై జిల్లా రీసోర్స్ పర్సన్స్ నాగేశ్వరయ్య, నాగశేషణ, రామసుబ్బారెడ్డి వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయంతి, సరళ, ఐసీడీఎస్ సూపర్వైజర్ దేవమణి బాలిక విద్య ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు సునీత, వెంకటరమణ, గోవింద రెడ్డితోపాటు సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

తలుపుల:కదిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో తలుపుల మండలం ఉన్న అంగన్వాడి టీచర్లకు తలుపుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం కు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంఇఒలు వెంకట రాముడు, విజయకుమార్ పూర్వ ప్రాథమిక విద్య శిక్షణ తరగతులు నిర్వహించి వాటి యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు నిహారిక, దీప, రిసోర్స్ పర్సన్లు రాజా రమణ, అనిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలంలోని అంగన్వాడీలకు ఆరు రోజులపాటు జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని ఉర్దూ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో నరసింహులు, ఎంఇఒలు నాగరాజు, కుళ్లాయప్ప, ఉర్దూ పాఠశాల హెచ్ఎం ఇర్షాద్, అంగన్వాడీ సూపర్వైజర్లు శ్రీ లక్ష్మి, మంజుల, డిస్టిక్ ఆర్పిలు సురేష్ బాబు, లక్ష్మీనారాయణ, ఫణి భూషణ్ రావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి స్టేషన్ పరిధిలో కర్నాటక మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. నల్లమాడ గ్రామంలో జనార్ధన , గంగన్న ఇంటి వద్ద సోదాలు నిర్వహించి కర్నాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సిఐ నాగరాజు, ఎస్ఐ ఉమామనోహర్ రాజు, సిబ్బంది సురేష్ బాబు, ప్రసాద్,నాగభూషణం, నరసింహ రెడ్డి, మురళీకృష్ణ, అల్లాబకష్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి -నల్లచెరువు

బాల్యవివాహాల పైన రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో మనోహర్ కస్తూరిబాయి పాఠశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒ శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - గుడిబండ

స్థానిక పోలీసుస్టేషన్‌ను పెనుగొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి పలు కేసుల వివరాలను ఎస్ఐ రాజకుల్లాయప్పను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మడకశిర రూరల్ సిఐ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంక దినకర్ రాక

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంక దినకర్ బుధవారం వస్తున్నారని కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల అయింది. మంగళవారం రాత్రి 8 గంటలకు ప్రశాంతి నిలయంలో శాంతి పవన్ అతిథి గృహానికి చేరుకుంటారన్నారు. స్థానిక కలెక్టరేట్ లో బుధవారం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జిల్లాలో 20 సూత్రాల అమలుపై అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. సంబంధిత అధికారులు తగు నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

లేపాక్షి బ్రహ్మోత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

శిల్ప, చిత్ర కళలకు నిలయమైన లేపాక్షి వీరభద్రాలయంలో ఈ నెల 25 నుండి నిర్వహించనున్న వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని జిల్లా కలెక్టర్ చేతన్ ను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రమానందన్ మంగళవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, లేపాక్షి బ్రహ్మోత్సవాలను గతంలో కంటే ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఆలయం కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చేనేతల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-హిందూపురం

చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని చేనేత కార్మికులు కోరారు. ఈ మేరకు మంగళవారం చేనేత ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ డి ఈ రమేష్ కుమార్, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పావులూరి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేనేత ఐక్యవేదిక సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ సరైన గిట్టుబాటు ధరలు లేక చేనేత కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలను తీసుకోవాలని కోరారు.

ఆదినారాయణ యాదవ్ మోసగాడు: రియల్టర్ ప్రభాకర్

ప్రజాశక్తి-పెనుకొండ

ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ యాదవ్ ఘరానా మోసగాడు అని రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్రభాకర్ ఆరోపించారు. మంగళవారం కియా ఇండస్ట్రియల్ ఏరియా పరిధిలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆదినారాయణ యాదవ్ చేసిన మోసాలను వివరించారు. కులం పేరుతో తనను మోసం చేసిన ఘనుడన్నారు. ఆదినారాయణ యాదవ్ మోసగించిన వారిలో రాజకీయ నాయకులు, ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలకు చెందిన కొందరు పోలీసు ఉన్నతాధికారులున్నారని అన్నారు. ముదిగుబ్బ మండలం లో గిరిజనులకు చెందిన భూములు లాక్కుని వారిని నట్టేట ముంచాడని ఆరోపించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి చేరి తన మోసాలను అక్రమాలను దాచిపెడుతున్నారనివిమర్శించారు. కియా పరిధిలో సమస్య ఉంటే అనంతపురంలో మీడియ సమావేశం నిర్వహిస్తే ఎలా అని ప్రశ్నించారు. ఆధారాలు ఉంటే అవి తీసుకుని పెనుకొండకు రావాలని సవాల్ చేశారు.

ఆరోగ్యశ్రీ రోగులపై దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు

బత్తలపల్లి : ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్సలు పొందే రోగుల పట్ల,సంబంధీకులు పట్ల దురుసుగా ప్రవర్తించినా, విధులలో అలసత్వం వహించిన చర్యలు తప్పవని మంత్రి సత్య కుమార్ యాదవ్ వ్యక్తిగత సహాయకులు హరీష్ బాబు ఆరోగ్య మిత్రలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద ఆర్తో వార్డులో చికిత్స పొందుతున్న పోట్లమర్రి గ్రామానికి చెందిన కుమ్మర మదనాపు ఆదినారాయణను పరామర్శించి ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ పథకంలో రోగుల పట్ల కుటుంబీకుల పట్ల ఆరోగ్య మిత్రలు వ్యవహరిస్తున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు.ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్ సమయంలో ఆరోగ్య మిత్ర బాలాజీ వ్యవహరించిన దురుసు ప్రవర్తనను హరీష్ బాబు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే సంబంధిత ఆరోగ్య మిత్ర జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవితో ఫోన్లో మాట్లాడారు. బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో ఇప్పటికే పలుమార్లు ఆరోగ్య మిత్రల పట్ల ఫిర్యాదులు అందాయని ఇప్పటికైనా పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెర్లోపల్లి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కదిరి టౌన్ : కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూర్ హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న కదిరి పట్టణ 26వ వార్డు కౌన్సిలర్ ఎం.ఎస్.ఫయాజ్‌ను స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం పరామర్శించారు.ఈ కార్యక్రమంలో టిడిపి కదిరి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, నాయకులు బహుద్దిన్, కౌన్సిలర్ కిష్టప్ప, మహబూబ్ బాషా, టిడిపి నాయకులు ఖాదర్‌బాషా, పాల్గొన్నారు.

గర్భిణులకు భోజన సౌకర్యం

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ హరికుమార్, డాక్టర్ ఓంకార్ ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు వైద్యపరీక్షలను నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఫారంసిస్ట్ ప్రభాకర్ రాజు గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించారు

పాత్రికేయుడిపై దాడి చేసిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఇనుము పైపును కొనుగోలు చేసేందుకు వెళ్లిన పాత్రికేయుని పట్ల దురుసుగా ప్రవర్తించి అమానుషంగా దాడి చేసిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక విలేకరులు కోరారు. ఈ మేకు వారు స్థానిక డీఎస్పీని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. హిందూపురం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కుమార్ పైపులు కొనుగోలు చేసేందుకు జీవన్ రెడ్డి అనే వ్యాపారి దుకాణానికి వెళ్లగా వ్యాపారి నిర్లక్ష్యంగా వ్యవహరించాడన్నారు. తొందరగా ఇవ్వాలని కోరగా దుర్భాషలాడుతూ. దాడికి పూనుకున్నాడన్నారు. దుకాణం నుండి బయటకు వచ్చి విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. చిన్నపాటి విషయానికి నడిరోడ్డులో తనపై దాడి చేశారని పాత్రికేయుడు ప్రశాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వ్యాపారి పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల్లో పని చేస్తున్న పాత్రికేయులు పాల్గొన్నారు.